## క్లుప్తంగా

### రీ సర్వేతో భూసమస్యలకు శాశ్వత పరిష్కారం



రీసర్వేపై ర్యాలీ చేస్తున్న తహసీల్దార్ భాస్కర్

**కళ్యాణదుర్గం రూరల్:** రీ సర్వేతో భూసమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ భాస్కర్ తెలిపారు. శుక్రవారం చాపిరి, పాలవాయి, గ్రామంలో ఫేస్– 2కింద రీసర్వే చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ రీ సర్వేకు రైతులందరూ సహకరించారలన్నారు. గ్రామాల్లో ఏళ్ల తరబడి ఉన్న వ్యవసాయ భూమి హద్దుల సమస్యలు, భూ సమస్యలకు రీసర్వే ద్వారా పరిష్కారం లభిస్తుందన్నారు.

### రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలని ధర్నా



తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందిస్తున్న రైతులు, ఆర్టీఐ సభ్యులు

**కుందుర్పి:** స్థానిక రెవెన్యూ కార్యాలయంలో జరుగుతున్న అక్రమాలను నిరసిస్తూ రైతులు, ఆర్టీఐ మండల కమిటీ సభ్యులు రెవెన్యూ కార్యాలయం ముందు శుక్రవారం ధర్నా చేశారు. ఆర్టీఐ మండల అధ్యక్షులు గోపాల్ మాట్లాడుతూ రైతులకు సంబంధించిన వివిధ రకాల సమస్యలు 9 నెలలుగా పరిష్కారం కాలేదని, ప్రతి పనికీ ముడుపులు ఇవ్వనిదే ఫైళ్లు ముందుకు కదలలేదన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ శ్రీనివాసులుకు అందించారు. ఆర్టీఐ సభ్యులు శ్రీనివాసులు, రంగస్వామి రైతులు మంజు, ఈరన్న, నాగభూషణ, సుశీల పాల్గొన్నారు.


### మాస్ కాపీయింగ్‌కు తావివ్వొద్దు



కూడేరులో పది పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్

**కూడేరు:** మాస్ కాపీయింగ్‌కుతావివ్వొద్దని, పక్కాగా పదో తరగతి పరీక్షలు నిర్వహించాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్ సూచించారు. శుక్రవారం ఇంగ్లిష్ పరీక్ష జరిగింది. కూడేరులోని హైస్కూల్‌లో నిర్వహిస్తున్న పది పరీక్షా కేంద్రాన్ని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్ తనిఖీ చేశారు. పిల్లలకు నీటి, గాలి, వెలుతురు సదుపాయాలను కల్పించారా? అని పరీక్షా కేంద్రం చీఫ్ అధికారి హిమశేఖర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఎంత మంది పరీక్ష రాస్తున్నారా ఆరా తీశారు.197 మందికి గాను ఇద్దరు గైర్హాజర్ అయినట్లు చీఫ్ అధికారి తెలిపారు. డీటీ సూర్య ప్రతాప్ ఉన్నారు.

### మెగా రక్తదాన శిబిరం




ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

**ఉరవకొండ:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, ఆర్ఆర్‌సీ, రెడ్‌క్రాస్, సత్యసాయి సేవా సంస్థ సంయుక్తంగా శుక్రవారం మోగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. విశ్రాంత అధ్యాపకులు, సత్యసాయి సేవా జిల్లా మెడికల్ కోఆర్డినేటర్ డాక్టర్ ధనంజయ, రెడ్‌క్రాస్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత వినోద్‌కుమార్ మాట్లాడారు. శిబిరంలో దాదాపు 50 మంది రక్తదానం చేశారు. వైస్ ప్రిన్సిపాల్ మస్తానప్ప, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు వెంకటరాముడు, పరమేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

### నేడు ముస్లింలకు ఇఫ్తార్ విందు

**ఉరవకొండ:** పట్టణంలోని ఏడు మసీదుల అభివృద్ధి కోసం ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ఆయన సోదరుడు పయ్యావుల శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఒక్కో మసీదుకు రూ.15 వేలు చొప్పున శుక్రవారం అందించారు.రంజాన్‌ను పురస్కరించుకొని శనివారం ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు.

### మండే ఎండ..తాపం తీర్చే ఈత



బొమ్మక్కపల్లి సమీపంలో నీటి గుంతలో సేదతీరుతున్న చిన్నారులు, యువకులు

**గుమ్మఘట్ట:** ఎండలు ముదురుతున్నాయి. ఉదయం 9 గంటలకే వీధుల్లోకి రావాలంటే జనం జంకుతున్నారు.ఇళ్లలో ఉంటే ఉక్కపోత, బయటకు వెళ్తే సుర్రుమంటున్న సూరీడు..పచ్చని చెట్లు, నీడన కొందరు సేదతీరుతున్నారు. పిల్లలు, యువకులు, మరికొందరు సమీపాల్లో వున్న నీటి గుంతలు, బావులు, చెరువుల వద్దకు వెళ్లి ఈతకు వెళ్లి తాపం తీర్చుకుంటున్నారు. రాయదుర్గం మండలం బొమ్మక్కపల్లి గ్రామ సమీపంలో ఉన్న నీటి గుంతలో పిల్లలు, యువకులు శుక్రవారం ఉత్సాహంగా ఈత కొడుతూ సేద తీరారు.



రాలిపోయిన మామిడి పిందెలు



# రాలిపోతున్న మామిడి ఆశలు

### రైతులకు దిగుబడిపై దిగులు

- చెట్లలో రాలిపోతున్న పూత, పిందెలు
- కనిపించని ఉద్యాన శాఖాధికారులు

**బొమ్మనహాళ్:** ఎంతో ఆశతో సాగు చేసిన మామిడి రైతుల ఆశలు రాలిపోతున్నాయి. ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలించక నెల రోజులు పూత ఆలస్యమైంది. పూత బాగా రావడంతో దిగుబడి ఆశాజనకంగా ఉంటుందని రైతులు సంబరపడ్డారు. ఉన్నపళంగా పూత రాలిపోతోంది. పిందెలు నిలవట్లేదు. కళ్లెదుటే నేల రాలుతుంటే రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. పూత నిలబెట్టుకునే మార్గం తెలియక దిక్కులు చూస్తున్నారు. పెట్టుబడి కూడా దక్కదనీ, తీవ్ర నష్టం తప్పదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో సుమారు 8 వేల ఎకరాల్లో మామిడి పంట సాగు చేపట్టారు. కళ్యాణదుర్గం డివిజన్‌లో 6,500 ఎకరాలకుపైగా అత్యధికంగా మామిడి సాగులోకొచ్చింది. బొమ్మనహాళ్ మండలంలోని ఉంతకల్లు, కల్లుదేవనహళ్లి, బండూరు, కొలగానహళ్లి, డి.హీరేహాళ్ మండలాల్లో మామిడి సాగు చేశారు. ఏటా పంట సాగు చేసే రైతులు పెరుగుతున్నారు.



ఉంతకల్లు వద్ద సాగు చేసిన మామిడి తోట

**వాతావరణ పరిస్థితులు అనుకూలించలేదు..**

సాధారణంగా డిసెంబర్‌లో రావాల్సిన పూత నెల రోజులు ఆలస్యంగా వచ్చింది. అయినా పూత విరబూయడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తూ సంబరపడ్డారు. దిగుబడి ఆశాజనకంగా వస్తుందని ఆశించారు. తర్వాత వచ్చిన పూత వచ్చినట్లుగానే రాలిపోతోంది. పిందెలు కూడా నేల రాలుతున్నాయి. చెట్లలో కాడలు మాత్రం కనిపిస్తున్నాయి. కళ్ల ముందే పూత, పిందెలు రాలిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొన్ని తోటలకు ఎరువులు వేసినా, పెద్దగా ఫలితం లేదని రైతులు తెలిపారు. పూత, పిందెలను కాపాడుకునేందుకు రైతులు పలురకాల మందులు పిచికారీ చేస్తున్నారు. అయినా ప్రయోజనం లేదు.

### పూత, పిందెలు రాలుతున్నాయి



మామిడి చెట్లకు పిల్ల పురుగులు ఆశించడంతోనే పూత, పిందెలు రాలుతున్నాయి. చిగుర్లు ఏర్పడే సమయంలో పిల్ల పురుగులు ఆకులపై చేరి గోకి రసాన్ని పీలుస్తాయి. తద్వారా పూత, చిగుర్లు, ఆకులు చిన్నవిగా మారి రాలిపోతాయి. పిందె ఏర్పడే సమయంలో తోలుపై గోకి రసాన్ని పీలుస్తాయి. పిందెలు కూడా రాలుతాయి. పురుగుల ఆశించిన కాయలపై మంగు ఏర్పడి, నాణ్యత దెబ్బతింటుంది. కాయలకు రక్షణ కవచం ఏర్పాటు చేసుకోవడం ద్వారా ఈ పురుగు నుంచి రక్షణ కల్పించొచ్చు. పురుగుల ఉధృతి మరీ ఎక్కువగా ఉంటే ఆసిఫెట్ 75 గ్రాములు, లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. పురుగు తగ్గకపోతే 15,20 రోజుల తర్వాత ప్రిప్రెనెస్ 5 ఎస్.సి 2 ఎంఎల్ లీటరు నీటిలో కలిపిగానీ, స్పైనోసైడ్ 45 ఎస్‌పి 0.3 ఎంఎల్ లీటరు నీటిలో కలిపిగానీ పిచికారీ చేసుకోవాలి.

– మౌనిక, హార్టికల్చర్ అధికారిణి, రాయదుర్గం

### అవగాహన కల్పించాలి



నేను 4 ఎకరాల్లో మామిడి పంటను సాగు చేశా. ఎకరాకు 70 మామిడి చెట్లను పెట్టా. మామిడి సాగులో రైతులకు మెలకువలు చెప్పేవారులేరు. మామిడి రైతులకు అవగాహన కల్పించేవారు కరువయ్యారు. జిల్లా ఉద్యానశాఖాధికారులు స్పందించి మామిడి రైతులకు అవగాహన కల్పించాలి.

– ముల్లా సికిందర్, రైతు ఉంతకల్లు గ్రామం, బొమ్మనహాళ్ మండలం

### తోటలోకి వెళ్తే బాధేస్తోంది



నేను కల్లుదేవనహళ్లి గ్రామ సమీపంలో 4 ఎకరాల్లో మామిడి పంట సాగు చేశా. 250కి పైగా మామిడి చెట్లు ఉన్నాయి. మామిడి పూత, పిందెలు రాలుతున్నాయి. మందులు పిచికారీ చేస్తున్నా పూత నిలవలేదు. ఎకరాకు రూ.60 వేల వరకు పెట్టుబడి పెట్టాం.

– దాదా ఖలంధర్, రైతు గోవిందవాడ గ్రామం, బొమ్మనహాళ్ మండలం

## కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

**బొమ్మనహాళ్:** స్థానిక కేజీబీవీలో 2025–26 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కమలమ్మ శుక్రవారం తెలిపారు. ఆరో తరగతి, ఇంటర్‌లో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. 6వ తరగతిలో 40 సీట్లు, ఇంటర్మీడియట్ సీఈసీ గ్రూప్‌లో కేవలం 40 సీట్లు మాత్రమే ఉన్నాయన్నారు. ఈ నెల 22 నుంచి ఏప్రిల్ 11 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అనాథలు, బడి బయట పిల్లలు, డ్రాపౌట్స్ పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బీపీఎల్ బాలికలు అర్హులన్నారు.

**ఉరవకొండ:** ఉరవకొండ కేజీబీవీలో ఆరోతరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రత్యేక అధికారిణి ఎం.ధనలక్ష్మి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో 40 సీట్లు, ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీహెచ్‌డబ్ల్యూ (ఎఫ్)లో 40 సీట్లు ఉన్నాయన్నారు.https://apkgbv.apcfssin ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

**గుమ్మఘట్ట:** బీటీపీ గ్రామంలోని కేజీబీవీలో ఆరో తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ షబానాబేగం శుక్రవారం తెలిపారు. 7,8,9,10,12 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం బాలికల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్: 7075159996, 7075039990లో సంప్రదించాలన్నారు.

**రాయదుర్గంటౌన్:** ఏపీ సమగ్ర శిక్ష ఉత్తర్వుల మేరకు కేజీబీవీలో ఈ నెల 22 నుంచి 6వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు కేజీబీవీ ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మీ శుక్రవారం తెలిపారు. కేజీబీవీలో ప్రవేశాల కోసం ఏప్రిల్ 11 వరకు అవకాశం ఉంటుందన్నారు.

## ఎయిడ్స్ రహిత సమాజమే ధ్యేయం



పోస్టర్లను విడుదల చేస్తున్న సిబ్బంది

**కుందుర్పి:** ఎయిడ్స్ రహిత సమాజమే ధ్యేయమని రిడ్స్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీనివాసరెడ్డి, స్థానిక వైద్యాధికారిణి చాంద్‌బేగం తదితరులు సూచించారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆవరణలో ఆశా కార్యకర్తలు, రిడ్స్ సంస్థ సిబ్బందికి ఎయిడ్స్ వ్యాధి నియంత్రణపై తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఔట్‌రీచ్ వర్కర్లు వరలక్ష్మీ, భాగ్యమ్మ, సీహెచ్‌ఓ ముంతాజ్, ఎల్‌టీ మధుబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

## కఠిన శిక్షలు అమలు చేయాలి

**కూడేరు:** కఠిన శిక్షలు అమలయితేనే బాల్యవివాహాలకు అడ్డుకట్ట వేయొచ్చని ట్రైనీ కలెక్టర్ వినూత్న సూచించారు..శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ సమీపాన అంగన్‌వాడీల రీసోర్స్ సెంటర్‌ను, జోడు లింగాల సంగమేశ్వర స్వామి ఆలయానికి వచ్చే చంటి పిల్లల తల్లులు బిడ్డకు పాలించేందుకు గాను వీలుగా ఉండేందుకు ప్రత్యేక గదిని ట్రైనీ కలెక్టర్ వినూత్న ప్రారంభించారు. రీసోర్స్ సెంటర్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాళ్లను ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె బాల్య వివాహాల నిషేధిత మరియు పర్యవేక్షణ కమిటీతో సమావేశమయ్యారు. బడి మానేసి బాలికలను గుర్తించి వారిని బడుల్లో చేర్పించేందుకు కృషి చేయాలన్నారు. బాలికల బంగారు భవిష్యత్ కోసం బాల్య వివాహాల నిషేధిత, పర్యవేక్షణ కమిటీ సైనికుల్లా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉరవకొండ ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీదేవి, ఏసీడీపీఓ ఎల్లమ్మ, సర్పంచ్ లలితమ్మ, మహిళా పోలీసులు పుష్ప, వెంకటరమణమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శిక్షణ కలెక్టర్ వినూత్న

**జోడు లింగాల సన్నిధిలో ట్రైనీ కలెక్టర్**

ట్రైనీ కలెక్టర్ వినూత్న శుక్రవారం కూడేరులో ప్రసిద్ధిగాంచిన శివపార్వతుల స్వయంభు జోడు లింగాల సంగమేశ్వర ఆలయాన్ని సందర్శించారు. ఆలయ అర్చకులు ఆమెకు పూర్ణకుంభంతో సాదరంగా ఆహ్వానం పలికారు. జోడు లింగాలను దర్శించుకొని ఆమె ప్రత్యేక పూజలు చేయించారు. తర్వాత అర్చకులు తీర్థప్రసాదాలు అందించారు. ఉరవకొండ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ శ్రీదేవి ఉన్నారు.

## పెన్నహోబిలం ఘటనపై సమగ్ర విచారణ జరపాలి

**ఉరవకొండ:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామికి ఆమిద్యాలకు చెందిన భక్తుడు సమర్పించిన బంగారం మాయమైన ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలని వైఎస్సార్‌సీపీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాకెట్ల అశోక్, మాజీ ఎంపీపీ ఏసీ ఎర్రిస్వామి, పట్టణ, రూరల్, మండల కన్వీనర్లు ఈడిగ ప్రసాద్, ఎర్రిస్వామిరెడ్డి, మూలగిరిపల్లి ఓబన్న మాట్లాడుతూ ఉరవకొండ నియోజకవర్గానికి చెందిన కూటమి నేతల అండదండలతోనే స్వామికి సమర్పించిన బంగారాన్ని మాయం చేసేందుకు ఆలయ అధికారులు ప్రయత్నించారన్నారు. 18న పెన్నహోబిలం హుండీ లెక్కింపు విషయాన్ని విలేకరులు, అధికారులకు తెలపకుండా గుట్టు చప్పుడు కాకుండా నిర్వహించారన్నారు. హుండీ లెక్కింపునకు ఏనాడూ రాని ఏసీ ఆదిశేషనాయుడు ఎందుకు వచ్చారన్న అనుమానులు కలుగుతున్నాయన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కచ్చితంగా ఇందులో అసిస్టెంట్ కమిషనర్ హస్తం కూడా ఉందని ఆరోపించారు. దేవదాయ శాఖ ఆర్‌జేసీ వెంటనే మరో అధికారితో విచారణ చేయించాలన్నారు. స్వామికి సమర్పించిన కానుకలను కూడా మింగేందుకు ఆలయ ఈఓ, ఏసీలు ప్రయత్నించారని, ఇందులో టీడీపీ నాయకుల హస్తం కూడా ఉందని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బసవరాజు, లత్తవరంగోవిందు, సుద్దాల వెంకటేష్, వేమన్న, మహనంది, ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యలపై అలసత్వం తగదు



మాట్లాడుతున్న హనుమంతరాయుడు

**రాయదుర్గంటౌన్:** విద్యా రంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం అలసత్వం తగదని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు హనుమంతరాయుడు పేర్కొన్నారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో స్థానిక విద్యార్థి నేతలతో కలిసి మాట్లాడారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లలో ఉన్న కుక్, అటెండర్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలన్నారు. జీవో నంబర్ 77ను రద్దు చేయాలని, జిల్లాలో ఎస్కే యూనివర్సిటీ పరిధిలో బోధన, బోధనేతర ఖాళీలను భర్తీ చేయాలన్నారు. డిగ్రీ కళాశాలల్లో మేజర్, మైనర్ సబ్జెక్టులను రద్దు చేసి పాత పద్ధతిలోనే తరగతులు కొనసాగించాలని డిమాండ్ చేశారు. రాయదుర్గం, గుమ్మఘట్ట, డి.హీరేహాళ్ మండలాల్లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, గురుకుల పాఠశాలల అభివృద్ధికి నోచుకోలేదన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి ఆంజనేయులు, ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు తరుణ్, అఖి, శ్రీధర్, గురుప్రసాద్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## హైవేపై సీసీ కెమెరాల ఏర్పాటు



మాళాపురం వద్ద ప్రమాదాలను అరికట్టేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్న పోలీసులు

**విడపనకల్లు:** మండల కేంద్రానికి సమీపంలో మాళాపురం వద్ద 42వ జాతీయ రహదారిపై ఎస్ఐ ఖాజా హుస్సేన్ శుక్రవారం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. బ్లాక్ స్పాట్ ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు ముందు జాగ్రత్తగా ఉరవకొండ రూరల్ సీఐ చిన్న గౌసు సూచనల మేరకు సోలార్ బేస్డ్ కెమెరాలు ఏర్పాటు చేయించారు.

## సంక్షిప్త సమాచారం

### అనారోగ్యంతో క్రీడాకారుడి మృతి

**కళ్యాణదుర్గం రూరల్:** గ్రామీణ క్రీడాకారుడు కొత్తపల్లి హనుమంతరాయుడు (76) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. మండల పరిధిలోని మోరేపల్లి గ్రామానికి చెందిన కొత్తపల్లి హనుమంతరాయుడు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. గ్రామీణ క్రీడాకారుడిగా రాష్ట్ర స్థాయి, అథ్లెటిక్స్‌లో ఎన్నో మెడల్స్ సాధించారు. హై జంప్, రన్నింగ్, వాలీబాల్ తదితర క్రీడల్లో నైపుణ్యం ప్రదర్శించి, అనేక బహుమతులు అందుకున్నాడు.

### స్పెషల్ స్క్వాడ్ పరిశీలన

**బొమ్మగుప్ప:** మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, శ్రీనివాస విద్యానికేతన్ పాఠశాలల్లో కొనసాగుతున్న పదో తరగతి పరీక్షలను శుక్రవారం స్పెషల్ స్క్వాడ్ జయనాయక్ టీం పరిశీలించింది. 213 మంది విద్యార్థులకు గాను 207 మంది హాజరయ్యారు. ఆరుగురు గైర్హాజరయ్యారు. శ్రీనివాస విద్యానికేతన్‌లో 209 మందికి గాను 206 మంది హాజరు కాగా, ముగ్గురు విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎంఈఓ మల్లారెడ్డి తెలిపారు.

### మున్సిపాలిటీకి నిధుల మంజూరు

**రాయదుర్గంటౌన్:** పురపాలక సంఘంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు రూ.3.65 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రత్యేక నిధులు ఎల్ఆర్ఎస్ కింద రూ.3 కోట్లు, 15వ ఆర్థిక సంఘం కింద రూ.65 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. నిధుల విడుదలకు సంబంధించి పూర్తిస్థాయి ప్రొసీడింగ్స్ రావాల్సి ఉందని కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. ఈ నిధులతో సీసీ డ్రైన్స్, రోడ్లు, తాగునీటి వసతి మెరుగుతోపాటు ఇతరాత్ర అభివృద్ధి పనులకు వినియోగించనున్నట్లు తెలిపారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**వజ్రకరూరు:** మండలంలోని అన్ని గ్రామాలకు శనివారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు మండల ట్రాన్స్‌కో ఏఈ షెక్షావలి తెలిపారు. నూతనంగా 132 కేవీ విద్యుత్ లైన్ లాగుతున్నట్లు తెలిపారు. శనివారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉరవకొండ ఫీడర్‌లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

### సీహెచ్‌ఓ బాధ్యతల స్వీకరణ

**బ్రహ్మసముద్రం:** స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇటీవల సీహెచ్‌ఓగా రాణి ఎస్తేర్ శుక్రవారం బాధ్యతలు తీసుకుంది. ఆమె కర్నూలులో పనిచేస్తూ బ్రహ్మసముద్రానికి బదిలీపై వచ్చింది.

### రీ సర్వే పారదర్శకంగా చేపట్టాలి

**బ్రహ్మసముద్రం:** రీ సర్వే పనులు పారదర్శకంగా చేపట్టాలని తహసీల్దార్ సుమతి అన్నారు. శుక్రవారం భైరసముద్రం గ్రామంలో రీ సర్వే పనులను ప్రారంభించారు. తహసీల్దార్ మాట్లాడుతూ రైతులు రెవెన్యూ అధికారులకు సహకరించి రైతుల భూములకు సంబంధించి హద్దులను ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎస్ సుబ్రమణ్యం, ఇన్‌చార్జ్ సర్వేయర్ మారెప్ప, కార్యదర్శి అనిల్, వీఆర్వోలు నాగరాజు, హనుమేష్ పాల్గొన్నారు.

### సమయపాలన పాటించాలి

**వజ్రకరూరు:** అంగన్‌వాడీ కార్యకర్తలు సమయ పాలన పాటించాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్లు పద్మావతి, హెచ్.పద్మా తదితరులు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడు రోజుల పాటు శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

### జనావాసాల్లోకి చిరుతలు

**కంబదూరు:** జనావాసాల్లోకి తరచూ చిరుతలు వస్తూ భయాందోళనకు గురి చేస్తున్నాయి. రెండు రోజుల నుంచి కంబదూరు పోలీసు స్టేషన్ సమీపంలోని ఆర్టీటీ కాలనీ పరిసరా ప్రాంతాల్లో అర్ధరాత్రి చిరుతలు సంచరించినట్లు కాలనీవాసులు తెలిపారు. గొర్రెల మందపై దాడి చేసేందుకు వచ్చిన చిరుతను చూసి కాలనీవాసులు ఇళ్లలోకి పరుగులు తీశారు.

### ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రైతు మృతి

**కూడేరు:** మరుట్ల–1వ కాలనీకి చెందిన రైతు గొల్ల గోపాల్ (48) అనంతపురం సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. గోపాల్ అప్పుల బాధ తాళలేక ఈనెల 18న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మృతుడి భార్య వరలక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని శవాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

### వారానికోసారి డ్రైడే పాటించాలి

**కణేకల్లు:** వారానికోసారి డ్రైడే పాటించాలని మలేరియా సబ్‌యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్ ప్రజలకు సూచించారు. శుక్రవారం కణేకల్లులోని వివిధ వార్డులలో డ్రై డేపై ఆయన ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడారు. చిన్నపాటి జాగ్రత్తలు పాటిస్తే వ్యాధులు దరిచేరవన్నారు. డ్రై డే పాటించడం, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం లాంటి జాగ్రత్తలు పాటిస్తే ఎలాంటి వ్యాధులు రావన్నారు. రాత్రిళ్లు దోమతెరలు తప్పని సరిగా వాడాలని మరీ ఎక్కువగా దోమలుంటే ఇంటి పరిసరాల్లో వేపాకు పొగ వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ వెన్నల, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

### రిజర్వు స్థలం చూపాలని నిరసన

**రాయదుర్గంటౌన్:** కణేకల్లు రోడ్డు సర్వే నంబర్ 493లో సర్వే చేపట్టి 40 సెంట్ల రిజర్వు స్థలం ఏమైందో రెవెన్యూ అధికారులు చూపాలని, ఆ భూమి ఎవరి ఆధీనంలో ఉందనే విషయాన్ని తెలియజేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కొట్రేష్, సీపీఐ కార్యవర్గ సభ్యుడు తిప్పేస్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం ఈమేరకు సదరు సర్వే నంబర్‌లోని భూమిలో నిరసన తెలియజేశారు. 2008లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఇళ్ల కోసం 150 ప్లాట్లు కేటాయించినట్లు చెప్పారు. అందులో 1వ నెంబర్ ప్లాటు శిల్ప అనే లబ్ధిదారురాలకు కేటాయించారన్నారు.

### పరిమితికి మించి తరలిస్తే వాహనం సీజ్

**బొమ్మనహాళ్:** పరిమితికి మించి కూలీలను తరలిస్తే వాహనం సీజ్ చేస్తామని ఎస్ఐ నబీరసూల్ హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలోని హైస్కూల్ వద్ద లగేజీ ఆటో డ్రైవర్లకు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎస్ఐ మాట్లాడుతూ గూడ్స్ వాహనాల్లో కూలీలను తరలించడం ప్రమాదకరమన్నారు. ఓవర్ లోడ్‌తో కూలీలను తీసుకెళ్తే ప్రమాదాలు జరిగి ప్రాణ నష్టం సంభవించే అవ కాశం ఉందన్నారు. ఇటీవల హరేసముద్రానికి చెందిన వారు టాటా ఏసీలో ఓ శుభ కార్యానికి వెళ్తూ ప్రమాదానికి గురై 18 మంది గాయాలపాలయ్యారన్నారు. వాహన డ్రైవర్లు మద్యం సేవించి, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదన్నారు. లైసెన్స్, ఇన్సూరెన్స్ ఉండాలన్నారు.

## రైతులకు ప్రభుత్వం కుచ్చుటోపీ

**కుందుర్పి:** అన్నదాత సుఖీభవ పేరుతో రూ.20 వేలు నగదు రైతుల ఖాతాల్లో జమ చేస్తామని చెప్పి చంద్రబాబు విస్మరించారని వైఎస్సార్‌సీపీ నాయకులు మండిపడ్డారు. శుక్రవారం మండల కేంద్రంలో మండల కన్వీనర్ హనుమంతరాయుడు, ఎంపీపీ భర్త నాగరాజు, ఎస్సీసెల్ డివిజన్ అధ్యక్షుడు తిప్పేస్వామి, మహిళావిభాగం తాలూకా అధ్యక్షురాలు నాగలక్ష్మీ, ఐటీ వింగ్ అధ్యక్షుడు మరిస్వామి విలేకరులతో మాట్లాడా రు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో రైతులకు సకాలంలో రైతు భరోసా అందించేవార న్నారు. కూటమి ప్రభుత్వం రైతులకు విత్తనాలు,ఎరువులు అందించిన పాపాన పోలేదన్నారు. గ్రామాల్లో డ్రైల్యాండ్ హార్టికల్చర్, మినీగోకులాల తదితర పథకాలు కేవలం అధికార పార్టీ వారికే అందించి అర్హులకు తీరని అన్యాయం చేశారన్నారు.

## ప్రశాంతంగా మార్కెట్ వేలం



మార్కెట్ వేలం నిర్వహిస్తున్న అధికారులు

**వజ్రకరూరు:** స్థానిక గ్రామ సచివాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సంత మార్కెట్, మినరల్‌వాటర్ ప్లాంట్ వేలం ప్రశాంతంగా జరిగింది. ఆరుగురు ఒక్కొక్కరు రూ.25వేలు చెల్లించి వేలంలో పాల్గొన్నారు. దేవదాస్ అనే వ్యక్తి సంతమార్కెట్‌ను రూ.40 వేలకు దక్కించుకున్నాడు. మినరల్ వాటర్‌ప్లాంట్‌కు వడ్డే లక్ష్మినారాయణ అనే వ్యక్తి రూ.40 వేలకు దక్కించుకున్నాడు. సర్పంచు మోనాలిసా, గ్రామ కార్యదర్శి మల్లయ్య, జూనియర్ అసిస్టెంట్ శంకర్, వార్డు సభ్యుడు అచ్చనాల మధుసూదన్, సచి వాలయ ఉద్యోగులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఫారంపాండ్ల లక్ష్యం పూర్తి చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

**కణేకల్లు:** ఫారంపాండ్ల లక్ష్యం పూర్తి చేయాలని ఎంపీడీఓ పీడీ శ్రీనివాసులు ఫీల్డ్ అసిస్టెంట్లకు ఆదేశించారు. శుక్రవారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ పనులపై జరిగిన సమీక్ష సమావేశంలో ఎంపీడీఓ, ఏపీఓ సుధాకర్ మాట్లాడారు. ప్రతి రైతు పొలంలో తప్పని సరిగా ఫారంఫండ్స్ నిర్మించాలన్నారు. ప్రతి కుటుంబానికీ వంద రోజుల పనిదినాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు సోమన్నగౌడ్, నరసింహాచారి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ రమణ పాల్గొన్నారు.